క్లుప్తంగా

పూర్తి కావచ్చిన ఇంటింటి కుళాయి పనులు

సీతానగరం: మండలంలో ఇంటింటి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పవన్‌కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక విలేరులతో ఆయన మాట్లాడారు. అంటిపేట పంచాయతీ పరిధిలోని వెంకటాపురం, వెన్నెల బుచ్చింపేట గ్రామాల్లో జరుగుతున్న ఇంటింటి కుళాయిల నిర్మాణ పనులు అండర్ గ్రౌండ్ పైపులైన్లు వేయడం, ఇళ్ల ముందు ట్యాప్‌లు అమర్చడం జరుగుతుందన్నారు. కుటుంబాలున్న ఇళ్లకు కుళాయి పనులు పూర్తి కావచ్చాయని తెలిపారు. ఇప్పటికే వివిధ గ్రామాల్లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా ఇంటింటి కుళాయిలును ప్రారంభించినట్లు పేర్కొన్నారు. మరో 4 గ్రామాల ప్రజలకు ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



స్తంభాల ఏర్పాటుపై రోడ్డు మార్గం పరిశీలిస్తున్న ఏఈ

మెంటాడ: మండల కేంద్రంలోని హరిత జాతీయ రహదారిని ఆనుకుని నిర్మాణం జరుపుకుంటున్న రింగ్‌రోడ్డుపై 32 విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయనున్నట్టు విద్యుత్ శాఖ ఏఈ పాండు తెలిపారు. రింగ్ రోడ్డు ప్రాంతాన్ని తన సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలతో పాటు ట్రాన్స్‌ఫారం ఏర్పాటుపై స్థలం పరిశీలించినట్టు ఆయన తెలిపారు. స్థల పరిశీలనలో ఆయనతో పాటు రింగ్‌రోడ్డు నిర్మాణ ప్రతినిధులతో పాటు ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు

24 వరకు రహదారి భద్రతా వారోత్సవాలు



పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద చేపడుతున్న వాహన తనిఖీలు

సాలూరు: రహదారి భద్రతా వారోత్సవాలు ఈ నెల 24 వరకు నిర్వహించనున్నట్టు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఒడిశా నుంచి ధాన్యం అక్రమ రవాణా నియంత్రణకు కలెక్టర్, డీటీఓ ఆదేశాల మేరకు పి.కోనవలస చెక్‌పోస్టు వద్ద పోలీసు శాఖతో కలిసి సంయుక్తంగా వాహన తనిఖీలు చేపడుతున్నామని తెలిపారు.

సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయింపు



సామాజిక భవన నిర్మాణానికి సంబంధించి, హక్కు పత్రం అందజేస్తున్న ఐటీడీఏ పీఓ నవ్య

సీతంపేట: మండలంలోని కడగండి పంచాయతీ పరిధి, కడగండివలస గ్రామంలో సామాజిక భవన నిర్మాణానికి స్థలం కేటాయించారు. ఈ మేరకు భవన నిర్మాణానికి సంబంధించి, హక్కు పత్రాన్ని ఐటీడీఏ పీఓ బి.నవ్య శుక్రవారం గ్రామస్తులకు అందజేశారు. అలాగే నాడు–నేడు పనుల కింద పాఠశాల భవన నిర్మాణానికి రూ.13 లక్షలు మంజూరు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఎస్.రాము, సాయికుమార్ పాల్గొన్నారు.

సబ్‌కలెక్టర్ పరిశీలన



ఆర్ అండ్ బీ కార్యాలయ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్

పాలకొండ రూరల్: పాలకొండ–సీతంపేట రోడ్డు ఆనుకుని ఉన్న ఆర్ అండ్ బీ కార్యాలయ ప్రాంగణంలోని 20 సెంట్ల ఖాళీ ప్రదేశాన్ని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ శుక్రవారం పరిశీలించారు. ఐటీడీఏ ద్వారా సమకూరే నిధులతో ఈ ప్రదేశంలో పెట్రోల్ బంకు లేదా ఇతర అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోనున్నట్లు ఆయన తెలిపారు. సబ్‌కలెక్టర్ వెంట డిప్యూటీ తహసీల్దార్ బుచ్చయ్య తదితరులు ఉన్నారు.

మొక్కజొన్న సాగుపై ఆసక్తి

- 100 రోజుల్లో పంట దిగుబడి
- ఎకరాకు రూ.30వేల వరకు ఆదాయం
- రబీ సాగులో మేలు

బలిజిపేట: వాణిజ్య పంటల సాగుతో అధిక లాభాలు ఆశిస్తున్న రైతులు మొక్కజొన్న వైపు ఆసక్తి చూపుతున్నారు. గతంలో ఖరీఫ్‌లో మొక్కజొన్న సాగు చేసి రబీలో విరామం ఇచ్చేవారు. సాగులో మెలకువలు, రైతుభరోసా కేంద్రాల నుంచి అందుతున్న సహకారంతో రబీలోనూ మొక్కజొన్న సాగుపై రైతులు దృష్టి సారిస్తున్నారు.



వంతరాం వద్ద సాగు చేస్తున్న మొక్కజొన్న

పెట్టుబడి తక్కువ..రాబడి ఎక్కువ

మొక్కజొన్న విత్తనం నాటక ముందు ఎకరానికి 10బస్తాల చొప్పున ఎరువులు చల్లాలి. 10 నుంచి 12రోజుల వ్యవధిలో సాగునీరు అందించాలి. గడ్డి ఉంటే విత్తనాలు నాటిన 15రోజుల్లో గడ్డి మందు పిచికారీ చేయాలి. రబీలో ఎక్కువ శాతం బోర్లున్న చోటే మొక్కజొన్న పంటను సాగు చేస్తారు. ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర కంటే బహిరంగ మార్కెట్లో ధర ఎక్కువగా పలుకుతోంది. ప్రైవేటు వ్యాపారులు గిట్టుబాటు ధర కంటే ఎక్కువ ధరకు రైతుల నుంచి పంటను కొనుగోలు చేస్తుండడంతో మళ్లీ అదే పంటను సాగు చేసేందుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. 100రోజుల్లో పంట చేతికి రావడం , నీటి వినియోగం తక్కువగా ఉండటం, పెట్టుబడి పెద్దగా లేకపోవడంతో ఈ సాగు బాగుందని రైతులు చెబుతున్నారు. సాధారణంగా మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు వ్యాపించి నష్టం కలుగజేస్తుంది. రైతులు సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడుతూ పంటను రక్షించుకుంటున్నారు.

గడిచిన మూడేళ్లలో రబీలో మొక్కజొన్న సాగు వివరాలు	
సంవత్సరం	సాగు విస్తీర్ణం
2020-21	1150 ఎకరాలు
2021-22	1449 ఎకరాలు
2022-23	1500 ఎకరాలు

ఆశాజనకంగా ఉంది

మొక్కజొన్న పంట ప్రస్తుతం ఆశాజనకంగా ఉంది. రేటు ఎక్కువ, ఆరుతడి పంట కావడంతో పెట్టుబడి తక్కువ. తక్కువ రోజులలో పంట చేతికి అంది వస్తుంది. దిగుబడి ఎక్కువగా వస్తుంది. వరి సాగు కంటే రైతులకు ఇబ్బందులు తక్కువ.

– శ్రావణ్, ఏఓ, బలిజిపేట

రాష్ట్రంలో ప్రజా సంక్షేమ ప్రభుత్వం



సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: ప్రజలందరి సంక్షేమాన్ని కోరే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. మండలంలోని పెదభోగిలి సచివాలయం – 2 పరిధిలో ఉన్న హౌసింగ్, హడ్కో కాలనీల్లో ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారధ్యం లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గ పార్టీ పరిశీలకురాలు శోభా హైమావతి ఎమ్మెల్యేతో పాటు కలిసి పాల్గొన్నారు. వీరికి పంచాయతీ సర్పంచ్ తేరేజమ్మ, ఎంపీటీసీలు బి.కుసుమ, ఎస్.గౌరీ, పి.సంధ్య గ్రామపెద్దలు ఘనంగా ఆహ్వానం పలికారు. అనంతరం కాలనీలో ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాలపై మాట్లాడారు. లబ్ధిదారులకు వారు పొందుతున్న ఫలాలను అడిగి తెలుసుకున్నారు. అర్హత ఉండి ఇంకా ఏమైనా సంక్షేమ పథకాలు అందలేకుంటే వాటి వివరాలను తెలుసుకుని ఉద్యోగులచే అక్కడికక్కడే నమోదు చేయించి వారికి ఉన్న అర్హత మేరకు పథకాలు అందేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కాలనీలో సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి పూర్తి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు, వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, మండల పార్టీ అధ్యక్షుడు బి.చిట్టిరాజు, డీసీసీబీ డైరెక్టర్ కృష్ణంనాయుడు, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు పి.ఈశ్వరనారాయణ, టి.వెంకటఅప్పల నాయుడు, పిల్లి సతీష్‌కుమార్, ఆర్వీ, ఎస్.రామకష్ణ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీడీఓ బి.కృష్ణమహేష్‌రెడ్డి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

వలంటీర్లపైనా ఏడుపేనా...

- ఎమ్మెల్యే జోగారావు

సీతానగరం: సేవాభావంతో నామమాత్రపు గౌరవ వేతనంతో సేవలందిస్తున్న వలంటీర్ల వ్యవస్థను చూసి ఓర్వలేకే ఈనాడు రామోజీ పత్రిక, పచ్చగ్యాంగ్ కలిపి తట్టుకోలేక విషపు రాతలు రాయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పరిశీలకురాలు శోభా హైమావతి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పచ్చ మీడియా గ్యాంగ్ ఈనాడు రామోజీ, చంద్రబాబు, రాధాకృష్ణ కుమ్మక్కై వలంటీర్ల వ్యవస్థపై విషం కక్కుతున్నారని ఆరోపించారు. వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా పని చేస్తుంటే ఓర్వలేక పిచ్చి రాతలు రాస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రభుత్వంలో పని చేస్తున్న వలంటీర్లు ప్రజల పట్ల బాధ్యతతో, విశ్వాసం, నమ్మకంతో పని చేస్తుంటే వారికి నచ్చడం లేదన్నారు. వలంటీరు వ్యవస్థ కూడా వారు చెప్పినట్టు నడవాలని కోరుకుంటున్నారని ఆరోపించారు. వలంటీరు వ్యవస్థ అంటే పచ్చ గ్యాంగ్‌కు ఎందుకంత భయమని ప్రశ్నించారు. ఈనాడు పత్రిక ఎప్పుడో చంద్రనాడు పత్రికగా మారిపోయిందన్నారు. చంద్రబాబు ఆలోచనలకు వంతపాడడం కోసం వ్యవస్థలను కించపరచడం మంచిది కాదన్నారు. జర్నలిజం విలువలను మంటగలిపి ఎల్లో సిరాతో ప్రభుత్వంపైనా.. వ్యవస్థలపైనా.. ముఖ్యమంత్రిపైనా.. నిత్యం విషపు రాతలు రాసి రామోజీరావు దిగుజారుడు రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష పాత్ర పోషించాల్సిన చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని పేర్కొన్నారు. ఎల్లో మీడియా రాతలను ప్రజలు ఎప్పుడో నమ్మడం మానేశారని చెప్పారు. ఈనాడు పత్రిక తెలుగుదేశం పార్టీ గజిట్ పేపరుగా మారిపోయిందని దుయ్యబట్టారు.

ఫ్రైడే డ్రై డేగా పాటించాలి



ఫ్రైడే- డ్రైడే ర్యాలీలో పాల్గొన్న డీఐఓ జగన్మోహనరావు

సీతానగరం: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఫ్రైడే – డ్రైడే పాటించి పరిశుభ్రమైన వాతావరణం కలిగి ఉండేలా వైద్య సిబ్బంది జాగ్రత్తలు పాటించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) టి.జగన్మోహనరావు అన్నారు. శుక్రవారం చినబోగిలిలో సీతానగరం ఆర్‌సీహెచ్ వైద్యాధికారిణి ఉషారాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రైడే డ్రైడే ర్యాలీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాడుక నీరు ఆరిపోయే విధంగా ప్రజలకు వివరించాలని కోరారు. అలాగే వీధుల్లో వాహనాల నుండి తీసేసిన టైర్లు, కొబ్బరి నీరు తీసిన తరువాత పారేసిన కొబ్బరి బురికెలు రోడ్డుపై విసిరేయడం వలన దోమలు ప్రబలడంతో వ్యాధులకు గురి చేస్తాయన్నారు. దోమల నివారణకు ప్రజలను చైతన్య పర్చాలని, ప్రతి శుక్రవారం శిథిలమైన కుండీలు, కొబ్బరి బురికెలు దూర ప్రాంతాల్లో వేయాలని సూచలు ఇవ్వాలని కోరారు. అనంతరం ఆర్‌సీహెచ్‌లో వ్యాధి నిరోధక మందులు నిల్వలు వినియోగంపై డాక్టర్ శిరీష, అరుణకుమారి, సూపరువైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

పాలకొండ రూరల్: పాలకొండ–శ్రీకాకుళం, పాలకొండ–విశాఖపట్నం, పాలకొండ–సీతంపేట రోడ్లలో పోలీసులు శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. లైసెన్స్, ఆర్‌సీ, సీబుక్ లేని వారితో పాటు మద్యం తాగి వాహనం నడుపుతున్న వారిపై చర్యలు తీసుకున్నారు. అధిక లోడు, పరిమితికి మించి ప్రయాణికులతో వస్తున్న వాహనదారులకు అపరాద రుసుం విధించారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని, లేకపోతే చర్యలు తప్పవని ఎస్‌ఐ బి.శివప్రసాద్ హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారిపై తొలుత చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాలతో రోడ్ల పైకి వచ్చేటప్పుడు సంబంధిత ధ్రువపత్రాలు వెంట తీసుకురావాలన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

వీరఘట్టం: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని, మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎ.ప్రభాకరరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో శుక్రవారం సమావేశమైన ఆయన గ్రామాల్లో తాగునీటి వనరుల పునరుద్ధరణకు ఇప్పటించే చర్యలు ప్రారంభించాలన్నారు. మరమ్మతులకు గురైన బోర్లు, అడుగంటిన బావులను గురించి, బాగు చేయాలన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించండి

వీరఘట్టం: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని ఎస్ఐ ఎం.హరికృష్ణ సూచించారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక కొత్తబస్టాండ్ సెంటర్‌లో ఆటోడ్రైవర్లకు ట్రాఫిక్ రూల్స్‌పై శుక్రవారం అవగాహన కల్పించారు. లైసెన్స్ ఉన్న వారు మాత్రమే వాహనం నడపాలని, పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వాహనంతో వెళ్లరాదన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు.

పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ

వీరఘట్టం: తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ప్రధానోపాధ్యాయుడు యు.అప్పారావు సూచించారు. మండలంలోని తలవరం గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడైన ఈయన శుక్రవారం గ్రామంలోని పదో తరగతి విద్యార్థుల ఇంటింటికీ వెళ్లి, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పాఠశాల నుంచి వచ్చిన విద్యార్థులకు పనులు చెప్పకుండా చదుకునే అవకాశం కల్పించాలన్నారు. ఏప్రిల్ 3 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతాయని, వారికి ఇప్పటి నుంచే ఇంట్లో ప్రశాంత వాతావరణం ఉండేలా జాగ్రత్త వహించాలన్నారు. టీవీ, సెల్ ఫోన్లకు దూరంగా విద్యార్థులను ఉంచాలన్నారు.

మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న ఎంపీడీఓ పైడితల్లి

గరుగుబిల్లి: జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెట్టాలని ఎంపీడీఓ జి.పైడితల్లి సూచించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆమె అక్కడి విద్యార్థుల విద్యాసామర్థ్యాలు పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. పిల్లలకు పెట్టే భోజనం రుచి, శుచితో కూడినదై ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

సంతోషిమాతకు ప్రత్యేక పూజలు



సంతోషిమాతకు పూజలు చేస్తున్న భక్తులు

భామిని: మండలంలోని బత్తిలి గ్రామంలో ఉన్న సంతోషిమాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు విచ్చేసి, తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు.

వేగవంతంగా ఇళ్ల నిర్మాణాలు



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ రఘురాం

పాచిపెంట: ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ రఘురాం అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని హౌసింగ్ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లతో హౌసింగ్‌పై శుక్రవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సచివాలయాల వారీగా ఇళ్ల నిర్మాణాలు ప్రగతిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు శ్లాబ్ నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు ఉగాది నాటికి గృహప్రవేశాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీడీఓ లక్ష్మీకాంత్, డీఈ సోమేశ్వరరావు, ఏఈ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భూ వివాదాలకు చెక్



వెంకటాపురంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రమణ

సీతానగరం: జగనన్న శాశ్వత భూరక్ష భూ హక్కు పథకం ద్వారా రైతులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న భూ వివాదాలకు చెక్ పడుతుందని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. అంటిపేట పంచాయతీ వెంకటాపురం గ్రామంలో సర్పంచ్ సిరికి మహేశ్వరరావు అధ్యక్షతన ఈ పథకం అమలుకు సంబంధించి గ్రామ సభ శుక్రవారం జరిగింది. సభలో ఆయన మాట్లాడుతూ రైతుల భూముల వివాదాలను చెక్ పెట్టేందుకే రీసర్వే ప్రభుత్వం చేపట్టిందన్నారు. భూములకు సంబంధించి రెవెన్యూ రికార్డుల్లో నమోదైన తప్పుప్పొలను సరిదిద్ది రైతులకు తమ భూములపై శాశ్వత భూ హక్కు కల్పించిందుకు రీసర్వే చేపట్టిందన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ జి.తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు విదా బాబు, మండల సర్వేయరు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన తప్పనిసరి



వార్డులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి

పార్వతీపురం టౌన్: సీజనల్ వ్యాధులపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి వుండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి అన్నారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా పార్వతీపురం పట్టణం 18వ వార్డులో ప్రజలకు శుక్రవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శీతాకాలం కారణంగా ప్రజలకు జ్వరాలపై అప్రమత్తం చేస్తూ మలేరియా, డెంగీ మొదలైన పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతీ ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఎవరికైనా జ్వర లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించాలని సిబ్బందికి వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని దోమలు ప్రబలకుండా పరిశుభ్రంగా ఆంచుకోవాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదినారాయణ, హెల్త్ సూపర్‌వైజర్ పుష్ప, ఏఎస్ఎంలు, వైద్య సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులో 62 రకాల మందులు



సంఘంవలసలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనూష

పార్వతీపురం టౌన్: ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ఇంటింటికి వైద్య సేవలు అందిస్తున్నామని, అందుబాటులో 62రకాల మందులు ఉన్నాయని వైద్యాధికారిని అనూష అన్నారు. మండలంలోని సంఘంవలస గ్రామంలో వైద్యశిబిరాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. అవసరమైన వారికి వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో నేలకు రెండు సార్లు నిర్వహించే వైద్య శిబిరాన్ని ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో నిర్వహించే శిబిరంలో 8 రకాల వైద్య పరీక్షలను నిర్వహిస్తున్నామన్నారు. అందుబాటులో 62రకాల మందులు అందుబాటులోఉన్నాయని, రోగికి అవసరమైన మేరకు మందులను అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లో మంచాన పడి వున్న రోగుల వద్దకు వెళ్లి ఇళ్లవద్దనే వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న ఈ ఫ్యామిలీ డాక్టర్ విధానానికి మంచి స్పందన లభిస్తుందన్నారు. రోగాల బారిన పడి గ్రామాల్లో ఏ ఒక్కరు ఉండకూడదనే ఉద్దేశంతో నిబద్ధతతో విధులను నిర్వహిస్తున్నామని, ప్రజలంతా ఈ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఎంలు, ఆశా వర్కర్లు, సీహెచ్‌ఓలు, 104 సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తాం



వినతిపత్రాన్ని అందజేస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు, నాయకులు

పార్వతీపురం టౌన్: అగ్రిగోల్డ్ కంపెనీ బాధితులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యక్ష జోక్యం ద్వారా 10లక్షలకు పైగా బాధిత కుటుంబాలకు న్యాయం చేయడం జరిగిందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. శుక్రవారం అగ్రిగోల్డ్ కస్టమర్స్, ఏజెంట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను తీసుకువెళ్లి మిగిలిన వారి డిపాజిట్లను కూడా తిరిగి వచ్చేలా కృషి చేస్తానన్నారు.

కార్యక్రమంలో అగ్రిగోల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, ఎస్.అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ల ఆకస్మిక తనిఖీ



వాటర్ ప్లాంట్ తనిఖీ చేసిన జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రమణ

పార్వతీపురం టౌన్: జిల్లాలో గల వాటర్ ప్లాంట్‌లలో నాణ్యతా ప్రమాణాల పరిశీలనకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్టు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి పీపీ రమణ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ప్రత్యేక తనిఖీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పార్వతీపురం యవీఆర్, ఇండస్ట్రీస్, సాయిరాం పోర్టబుల్ వాటర్ ప్లాంటులతో తనిఖీలు నిర్వహించి శాంపిల్స్ తీసుకుని నాణ్యతా ప్రమాణాల పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించినట్లు తెలిపారు. వారికి గల బీఎస్ఐ, ఐఎస్ఐ, భద్రతా ప్రమాణాల అనుమతులు పరిశీలించామన్నారు. వాటర్ ప్లాంట్లలో పరిశుభ్రత పాటించాలని సూచించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టరు బి.సింహాచలం, సిబ్బంది పాల్గొన్నారు.